విశాలాంధ్ర
విశాఖపట్నం
పేజి నెం. 5
సోమవారం 22, ఏప్రిల్, 2024

ఇండియా కూటమి అభ్యర్థి విమలను గెలిపించుకుందాం

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 61వ వార్డు మల్కాపురం గొల్లవీధిలో పశ్చిమ నియోజకవర్గ ఇండియా కూటమి అభ్యర్థి అత్తిలి విమల గెలిపించాలంటూ ఆదివారం సీపీఐ నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. అత్తిలి విమలను గెలిపించుకోవడం ద్వారా పశ్చిమ నియోజకవర్గంను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కాండ్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు, సీనియర్ నాయకులు నూనెల సూరిబాబు, మహిళా నాయకురాలు జి.జయ, తదితరులు పాల్గొన్నారు.

సేవా సంఘాలతో సమావేశమైన ఈఓ

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి నిజరూప దర్శనం (చందనోత్సవం) నిర్వహణపై కార్యనిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసమూర్తి దేవస్థానం అధికార, సిబ్బంది, సేవా సంఘాలతో సమావేశం నిర్వహించారు. మే 10వ తేదీ అక్షయ తృతీయ సందర్భంగా ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం శ్రీ సింహాద్రి నాధుని నిజరూప దర్శనం నకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం సమావేశం నిర్వహించారు. సమావేశంలో సేవా సంఘాల వారు భక్తులకు వారు కల్పించే ప్రసాదములు చక్ర పొంగలి, పులిహోర వితరణ, బిస్కెట్స్, గ్లూకోస్, లెమన్ వాటర్, బటర్ మిల్క్, ఫ్రూట్స్ వంటి పదార్థాలు భక్తులకు అందించే వివిధ సేవలపై సేవా కార్యక్రమాలపై వివరించారు. ఈ సమావేశంలో శ్రీ లలిత దేవి సేవా సంఘం, వెంకట అన్నమాచార్య సేవా సంఘం, శిరిడి సాయి సేవా ట్రస్ట్, శ్రీశ్రీశ్రీ మాత కన్యకా పరమేశ్వరి కళింగ వైశ్య సంఘం, రిటైర్డ్ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ అనకాపల్లి, భారతీయ సాంస్కృతిక సముద్ధరణ సంస్థ తదితర సంఘాల వారితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజు, రాంబాబు, సహాయ కార్యనిర్వహణాధికారులు రమణమూర్తి, ఆనంద్ కుమార్, రాజేంద్ర, నర్సింగరావు, డిఈ నాగేశ్వరరావు, ఏఈ హరిరాజు, తాతాజీ పాల్గొన్నారు.

ఎస్సీ సంఘం నాయకులతో మంత్రి అమర్నాథ్ భేటీ

విశాలాంధ్ర - గాజువాక: గాజువాక నియోజకవర్గంలోని ఎస్సీ సంఘాల పెద్దలతో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి గుడివాడ అమర్నాథ్ ఆదివారం సమావేశం అయ్యారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వైసిపి రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మార్డుపూడి పరదేశి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రి అమర్నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ బడుగు బలహీన వర్గాలకు జగన్ మోహన్ రెడ్డి ఎంతో మేలు చేశారని, ఈ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి ఓటేసి మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలని సూచించారు. అలాగే గాజువాక నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో తనను గెలిపించి రాష్ట్రంలోని వైసిపి విజయానికి ఇక్కడి నుంచే నాంది పలకాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే నెల రెండో తేదీన గాజువాక నియోజకవర్గంలోని ఎస్సీ సంఘాలతో భారీ సమావేశం ఏర్పాటు చేయనున్నామని, ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని అమర్నాథ్ విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాటూరి శ్రీనివాసరావు, వై.మస్తానప్ప, గంట్యాడ గురుమూర్తి, బలిరెడ్డి పెంటారావు కాకినాడ పెంటారావు కొల్లి దేవుడు, గోవిందరాజు, గాలి ఆనంద్, పాము రామశాస్త్రి కంచర్ల శ్రీదేవి, కటికల కల్పన, ఇసుకపట్ల మీరాబాయి, కె.పుల్లారావు, అనపర్తి రమణ, వెంకటేష్, పేకెట్ శ్రీను, డాక్టర్ రాజారావు, సాపే బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పైడిమాంబ అమ్మవారి నూతన దేవాలయం ఏర్పాటుకు చర్యలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: పైడిమాంబ తల్లి అమ్మవారి నూతన దేవాలయం నిర్మాణ కమిటీ నియామకానికి గ్రామపెద్దలు ఏకగ్రీవ తీర్మానం చేశారు. పైడిమాంబ తల్లి అమ్మవారి ఆలయంలో గ్రామ పెద్దలు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యంగా శ్రీ పైడిమాంబ తల్లి అమ్మవారి నూతన దేవాలయం నిర్మాణం చెయ్యటానికి గ్రామంలో ఉన్న అన్ని వర్గాలను కలుపుకొని నూతన దేవాలయం నిర్మాణ కమిటీ ఏర్పాటు చేయాలని ఏకగ్రీవ తీర్మానం ఆమోదించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లడుతూ దాదాపు అమ్మవారి ఆలయం నిర్మించి 44 ఏళ్లు పూర్తి అయిందని, కావున అమ్మవారి నూతన దేవాలయం అత్యాధునికంగా నిర్మించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు జెర్రిపోతుల ముత్యాలు, పీత వెంకట రమణ, ములగపాక అచ్చిం నాయుడు, మంత్రి గోపి నారాయణ, పల్లం అప్పలరాజు, బత్తిన నాగభూషణం, గొంప రామారావు, గెద్దం వెంకట రమణ, బాతు అప్పారావు, తలారి నాగేశ్వరావు, కట్టా సతీష్, పితాని భాస్కర రావు, పీత నాగరాజు, తాటికొండ వెంకటరావు, ఇందల సంతోష్, ములగపాక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భీమిలిలో అవంతిదే గెలుపు

విశాలాంధ్ర - పీఎం పాలెం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా భీమిలి నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాస్ జోరుగా ప్రచారం చేస్తున్నారు. జీవీఎంసీ జోన్ 2, 5వ వార్డు గడప గడపకు వెళ్లిన ఆయనకు ప్రజలు అడుగడుగునా నీరాజనం పలికారు. లక్ష్మీ టవర్స్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు తాము అర్హులం కాకపోయినా జన రంజకమైన పాలన తమను ఆకట్టుకుందని అన్నారు. ఈ ఐదేళ్ళ కాలంలో భీమిలి నియోజకవర్గం మొత్తం చేసిన అభివృద్ధిని వివరిస్తూ తమ అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించమని కోరారు. స్థానిక సమస్యలు పరిష్కారానికి మరింత శ్రద్ధతో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు, లక్ష్మీ టవర్ గృహ సముదాయం సంఘ సభ్యులు చంద్రశేఖర్, శ్రీనివాస్, దుర్గారావు, విశ్వనాథం, రామారావు, సత్యనారాయణ, జగదీష్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్ యాత్రకు పోటెత్తిన జనం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బస్సు యాత్రకి జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఎన్ఏడి కొత్త రోడ్డు ప్రాంతంకి బస్సు యాత్ర చేరుకోగానే విశాఖ వైసీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఆదివారం సాయంత్రంకి అక్కడికి వచ్చిన సీఎం జగన్‌కి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి, విశాఖపట్నం పశ్చిమ అభ్యర్థి ఆదారి ఆనంద్ కుమార్‌లు స్వాగతం పలికారు. నిర్ణయించిన సమయానికి కంటే ముందుగానే జగనన్న బస్సు యాత్ర ప్రారంభం అయింది. ఇసుక వేస్తే ఇసుక రాలనంతగా బస్సు యాత్రను చూసేందుకు మహిళలు పెద్ద ఎత్తున రోడ్లపైకి చేరుకున్నారు. సింహాచలం ఆర్చ్ నుంచి గోపాలపట్నం, ఎన్ఏడీ కొత్తరోడ్డు మర్రిపాలెం, కంచరపాలెం మీదుగా జన సందోహం మధ్య వేలాదిగా తరలి వచ్చారు. ప్రతీ ఒక్కరినీ బస్సుపై నుంచే చేతులు ఊపుతూ ఆర్తిగా పలకరిస్తూ జగన్ మోహన్ రెడ్డి ఆకట్టుకొన్నారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో విశాఖపట్నం ప్రజలు జగన్ మోహన్ రెడ్డికి బ్రహ్మ రథం పట్టారు. విశాఖ ప్రజలు ఆదరణ మధ్య జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర నగరంలో కోలాహలంగా జరిగింది.

జగన్ కోసం మండుటెండలో జనం

విశాలాంధ్ర - పెందుర్తి: సిద్ధం పేరుతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన ఎన్నికల ప్రచారం ప్రజలకు నరకం చూపించింది. ఆదివారం ఉదయం తొమ్మిదిన్నర గంటలకే జీవీఎంసీ 94వ వార్డు వేపగుంట కూడలికి సీఎం వస్తారంటూ వైసీపీ నాయకులు నియోజకవర్గ పరిధిలోని నలుమూలల నుండి ప్రజలను అక్కడికి చేర్చారు. అయితే ముఖ్యమంత్రి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అక్కడికి చేరుకోలేదు. దాదాపు నాలుగు గంటల పాటు వందలాదిమంది మహిళలు, వృద్ధులు మండుటెండలో వేచి చూడాల్సి వచ్చింది. భానుడి భగభగలతో నిలబడేందుకు కూడా నీడ లేక ప్రజలు అల్లాడిపోయారు. మరోవైపు నలువైపులా వాహనాలను ఆపేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ముఖ్యమంత్రి వెళ్లిపోయిన తర్వాత దాదాపు గంట వరకు వాహనాల రాకపోకలు కొనసాగాయంటే, ట్రాఫిక్ ఎంత మేర నిలిచిపోయిందో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు ముఖ్యమంత్రి మాట్లాడతారని ఆశించిన వైసిపి నాయకులు, కార్యకర్తలకు ఆశా భంగం ఎదురైంది. కేవలం బస్సుపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ జగన్ వెళ్లిపోవడంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, నియోజకవర్గ సమన్వయకర్త అజయ్ రాజ్, వైసిపి నాయకులు ముమ్మన దేముడు, బయలపూడి భగవాన్ జయరాం, మెంట్ మహేష్, మేడిశెట్టి ఈశ్వరరావు (మాస్టారు) మూడు మండలాల వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పశ్చిమంలో హోరెత్తిన మేము సిద్ధం బస్సు యాత్ర

ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్‌తో కలిసి ముఖ్యమంత్రి జగన్ రోడ్ షో

విశాలాంధ్ర -మర్రిపాలెం/గోపాలపట్నం: రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న మేము సిద్ధం బస్సుయాత్రలో భాగంగా పశ్చిమ నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రోడ్ షో, అశేష జనవాహిణి నడుమ ఎంతో ఉత్సాహంగా సాగింది. రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్ కుమార్‌తోకలిసి నిర్వహించిన రోడ్ షోలో నియోజకవర్గం ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. రోడ్లన్నీ జన సంద్రాన్ని తలపించింది. గోపాలపట్నం జంక్షన్ నుండి, ఎన్ఏడి, కరాస, న్యూ కరాస (బంగారమ్మ, దుర్గాలమ్మ గుడి) మర్రిపాలెం, ఐ టీఐ జంక్షన్, ఊర్వశి మీదగా కంచరపాలెం వరకు రోడ్ షో సాగింది. పెందుర్తి మండలం చిన్నయ్య పాలెం నుంచి మధ్యాహ్నం చేరుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, గోపాలపట్నం నుంచి సాయంత్రం రోడ్ షో నిర్వహించారు. అడుగడుగునా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. జనం నుంచి కూడా స్పందన కనిపించింది. ఎక్కడికక్కడ ప్రజలు ముఖ్యమంత్రికి సాదర స్వాగతాలు పలికారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలో గోపాలపట్నం నుంచి కంచరపాలెం వరకు జరిగిన రోడ్ షోలో వేలాదిగా జనం తరలి వచ్చారు. మేము సిద్ధం బస్సు యాత్రలో ముఖ్యమంత్రితో పాటు ప్రజలు కూడా వెంట వెళ్లారు. సీఎం ప్రజలందరిని ఆప్యాయంగా పలకరిస్తూ, అభివాదం చేయడం ప్రజలను ఆకర్షించింది. డప్పు వాయిద్యాలు, పొడుగు మనుషులు, తప్పట గుళ్ళు, ఒంటెలు, కోలాటం, పులి వేషాలు, రోడ్ షోలో ప్రధాన ఆకర్షణగా కనిపించాయి. బిఆర్‌టీఎస్ రోడ్లన్నీ జన సందోహంతో కిక్కిరిసిపోయాయి. రోడ్డుకి ఇరువైపులా భారీగా జనం చేరుకొని ముఖ్యమంత్రికి జేజేలు పలికారు.

ఆక్రమణదారులపై కేసు నమోదు చేయాలి

రైతులు పిల్లి సత్యవతి, పిల్లి వెంకటేశ్వరరావు డిమాండ్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: తమ భూములను ఆక్రమిస్తున్న వారిపై కేసు నమోదు చేయాలని రైతులు పిల్లి సత్యవతి, పిల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేసారు. వుడా అధికారితో కలిసి ఎటువంటి పత్రాలు, డాక్యుమెంట్‌లు లేకుండానే కబ్జాకు పాల్పడుతున్నారని రైతులు పిల్లి సత్యవతి, పిల్లి వెంకటేశ్వరరావు ఆరోపించారు. వీరు విలేకరులతో మాట్లాడుతూ మధురవాడ లోని సర్వే నెంబరు 127లో గతంలో అతిపెద్ద భూస్కామ్ జరిగిందని, దీనిపై సిట్ కూడా వేసారని, నకిలీ పట్టాలతో భూములు కాజేందుకు ప్రయత్నించారని తేలడంతో ఆ లేఅవుట్ రద్దు చేయడంతో పాటు లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్లు కూడా వెనక్కి తీసుకున్నారన్నారు. ఇప్పుడు మళ్లీ అదే భూమిని ఆక్రమించేందుకు ఓ రియల్టర్ ప్రయత్నం చేస్తున్నాడని, వీఎంఆర్డీఏలో ఓ ఏవో అతనికి మద్దతుగా నిలబడడంతో ఆ భూమిలో నిర్మాణం చేపట్టేందుకు సిద్ధమయ్యాడు అని ఆరోపించారు.

2005లో రెవెన్యూ విభాగం ఈ భూములు స్వాధీనం చేసుకున్నందుకు ప్రయత్నం చేయగా రైతులకు వ్యతిరేకించి కోర్టుని ఆశ్రయించారని, హైకోర్టు నుంచి స్టేటస్ కో తెచ్చుకున్నారని తెలిపారు. అధికారుల మద్దతుతో భూ ఆక్రమణకు రావడంతో రైతులు 2016లో భీమిలి కోర్టు నుంచి వుడాకు వ్యతిరేకంగా పర్మినెంట్ ఇంజక్షన్ తెచ్చుకున్నారన్నారు. వుడా భూమిని ఆక్రమిస్తున్న వారిపై కేసులు పెట్టాల్సింది పోయి తిరిగి ప్రోత్సహించడం పట్ల స్థానికులు, రైతు కుటుంబాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ రియల్టర్ లచ్చిరాజు అనుచరులు రైతులపై దాడి చేసేందుకు ప్రయత్నించగా పీఎం పాలెం పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది అన్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమిస్తున్న వారిపై కేసు నమోదు చేయాలని కోరారు.

టీడీపీ అభ్యర్థులకు బి-ఫామ్‌లు అందజేత

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదగా విశాఖ జిల్లాలో టిడిపి కూటమి అభ్యర్థులకు బీఫామ్‌లు ఆదివారం అందజేశారు. విశాఖపట్నం పార్లమెంట్ అభ్యర్థి శ్రీ భరత్, భీమిలి అసెంబ్లీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు, విశాఖ తూర్పు అభ్యర్థి వెలగపూడి రామకృష్ణ బాబు, విశాఖ పశ్చిమ అభ్యర్థి పి.గణబాబు, గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాస్, ఎస్.కోట అభ్యర్థి కోళ్ళ లలిత కుమారిలకు ఆదివారం విజయవాడ మంగళగిరి పార్టీ కార్యాలయంలో బీఫారం అందజేసి అల్ ది బెస్ట్ చెప్పి చంద్రబాబు దీవెనలు అందజేశారు. బీ ఫారం అందుకున్న అభ్యర్థులు చంద్రబాబునాయుడుకు, కూటమి పెద్దలకు ధన్యవాదములు తెలియజేసారు.

మేము మీ వెంటే ఉంటాం

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ గోపాలపట్నం 92వ వార్డు వెంకటాపురం రజకుల కాలనీ శ్రీ పైడిమాంబ రజక సంఘం సభ్యులందరూ జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదారి ఆనంద్ కుమార్‌కు మద్దతుగా ఉంటామని అన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఆదారి ఆనంద్ కుమార్, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ పైడిమాంబ రజక సంఘం అధ్యక్షులు వై.అప్పలరాజు, కార్యదర్శి సిహెచ్.గంగాధర్, సిహెచ్.పైడిరాజు, కొండవలస కనకరాజు, ఎన్.లక్ష్మణరావు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా పండిత సదస్సు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి స్వామివారి వార్షిక తిరు కళ్యాణ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు సర్వ జన మనోరంజని వాహనంలో ఊరేగారు. ముందుగా పండిత సదస్యం జరిగింది. దేవస్థానం స్థానాచార్యులు డా.టీపీ రాజగోపాల్ పర్యవేక్షణలో చతుర్వేద పండితులు వేదపారాయణ, స్థానాచార్యులు నాలాయిర దివ్యప్రబంధం పఠనం చేశారు. ముందుగా సింహాద్రి అప్పన్నకు షోడశోపచారాలు సమర్పించి కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయ ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు పండితులు పాల్గొన్నారు.

వైసీపీలో పలువురు చేరిక

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి నియోజకవర్గం రెండవ వార్డు, మూడవ వార్డు బోయ వీధి, సంతపేట మున్సిపాలిటీ నుంచి చీకటి ఊర్మిల, చిల్లకరుణాకర్ రెడ్డి, కదిరెల్లాజీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీ, జనసేన నుంచి పలువురు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా అవంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి గంట శ్రీనివాసరావు ఎన్ని కుతంత్రాలు చేసిన గెలుపు నాదేనని

జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి సంక్షేమం ఎమ్మెల్యేగా గెలిపిస్తాయని అన్నారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తే విశాఖ పరిపాలన రాజధానిగా అవుతుందని, ఎన్నో కంపెనీలు వస్తాయని ఉద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేవిడిలో మజ్జిగ చలివేంద్రం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం రేవిడి గ్రామంలో మజ్జిగ చలివేంద్రాన్ని శ్రీ శ్రీనివాస యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాట శ్రీనివాస రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టి హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు వాండ్రాసి సతీష్, రేవిడి రిటైర్డ్ ఎంపీడీఓ సత్య బాపిరాజు, తోగురోతు తమ్ము నాయుడు, శ్రీనివాస యువజన సేవా సంఘం అధ్యక్షులు కోన సన్యాసినాయుడు, ఉపాధ్యక్షులు పాండ్రంగి సత్యం నాయుడు, కార్యదర్శి పద్మనాభ స్వామి, సహాయ కార్యదర్శి రెడ్డి నారాయణప్పడు, సభ్యులు సారిక శంకర్రావు, మజ్జి శంకర్రావు, సంపంగి అప్పలరాజు, సంఘం పూర్వ అధ్యక్షులు పతివాడ ఇంద్రరావు, ఉపాధ్యక్షులు చిరంజీవి, సభ్యులు సుంకర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విలువైన మానవ వనరులు అందించడంలో ఆచార్యుల పాత్ర కీలకం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారత్‌ను విశ్వగురువుగా తీర్చిదిద్దుదామని ఏఐసిటిఈ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం ఏయూ వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో బ్రెయిన్ ఓ విజన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రధానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా విద్య, పరిశోధన రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న ఆచార్యులను సత్కరించారు. భారత్‌ను సూపర్ పవర్‌గా తీర్చిదిద్దడంలో దేశానికి అవసరమైన విలువైన మానవ వనరుల తయారీలో ఆచార్యుల పాత్ర కీలకమన్నారు. ఆచార్యులను గుర్తించడం, గౌరవించడం మన సంప్రదాయమన్నారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి మాట్లాడుతూ నైపుణ్యాలు నేటి సమాజంలో విద్యార్థి విజయానికి ఎంతో అవసరమన్నారు. దీనికి ప్రాధాన్యత ఇస్తూ యువతను తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థులను వెన్నుతట్టి ప్రోత్సహించడం మరువరాదన్నారు. ఈ అవార్డులు మీ బాధ్యతను మరింత పెంచుతాయన్నారు. బ్రెయిన్ ఓ విజన్ సంస్థ సిఈఓ డి.గణేష్ నాగు మాట్లాడుతూ 12 రాష్ట్రాలకు చెందిన 320 అధ్యాపకులు, కళాశాలల నిర్వాహకులు, ప్లేస్మెంట్ అధికారులు, పరిశోధకులకు అవార్డులను ప్రధానం చేస్తున్నామన్నారు. విద్యార్థులే ఓటింగ్ చేసి వీరిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్వీస్ నౌ డైరెక్టర్ జి. భాస్కర్, సిటో హెల్త్ కేర్ సిఈఓ ఎస్.వి కృష్ణ ప్రసాద్, ధనేకుల సంస్థ ప్రతినిధి డి.కె.ఆర్.కె రవి ప్రసాద్ తదితరులు ప్రసంగించారు.

ఘనంగా ఎన్ఎస్ఆర్ఐటి 13వ వార్షికోత్సవం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలో సొంత్యాం పరిధిలో నడింపల్లి సత్యనారాయణ రాజు కళాశాలలో 13వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఐఐటీ మాజీ ప్రొఫెసర్ డాక్టర్ రాజ్‌పాల్ దహియా మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యపై విద్యార్థులకు విపులంగా వివరించారు. జేఎన్టీయూ రిజిస్ట్రార్ డా. జి.జే.సుమ మాట్లాడుతూ సాంకేతిక విద్య యొక్క అభివృద్ధి చెందుతున్న ప్రకృతి దృశ్యంపై విలువైన సమాచారాన్ని అందించారు. టిలిచో ల్యాబ్స్ సీఈఓ కిరణ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కెరీర్‌లో స్థిరపడాలన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఎన్. సత్యనారాయణ రాజు, కార్యదర్శి డాక్టర్ ఎస్.ప్రసాద రాజు, కోశాధికారి ఎన్.కనక రాజు, ప్రిన్సిపాల్ ఎస్.శంభు ప్రసాద్, డా. జె.రాజా మురుగదాస్, అన్ని విభాగాల అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మోడీ, చంద్రబాబు గెలవాలి

సీఎం రమేష్, పంచకర్ల గెలుపు కోసం సతీమణులు ప్రచారం

విశాలాంధ్ర - పెందుర్తి: ప్రధానిగా నరేంద్ర మోడీ, ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టడం ద్వారానే యువతకు ఉపాధి లభిస్తుందని ఎన్డీఏ కూటమి అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ నాయుడు సతీమణి శ్రీదేవి, పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు సతీమణి మహాలక్ష్మి, జీవీఎంసీ 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు స్పష్టం చేశారు. జీవీఎంసీ 97వ వార్డు కార్మిక నగర్‌లో బిజెపి పెందుర్తి నియోజకవర్గం ఇన్చార్జ్ శ్రీనివాస్ నాయుడు, కన్వీనర్ గొర్లె రాము నాయుడు, పార్టీ మహిళా నాయకులు మాధవి, జ్యోతి, సుధా, జనసేన ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ సుధా ఆ పార్టీ నాయకులు గొర్లె అప్పారావు, సేనాపతి సోమశేఖర్, ఆర్ఎస్ నాయుడు తదితరులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టగా, అక్కడి ప్రజలు ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా పూల వర్షం కురిపించి అభిమానం చాటుకున్నారు. మహిళలు హారుతులిచ్చి నుదుట తిలకం దిద్దారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతంగా ఉన్న అనకాపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశించడంతో సీఎం రమేష్ ఇక్కడికి వచ్చారని వెల్లడించారు. రాజ్యసభ సభ్యుడుగా కడప జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేసిన సీఎం రమేష్ అనకాపల్లి జిల్లాను కూడా అంతే సుందరంగా తీర్చి దిద్దుతారని స్పష్టం చేశారు. తన పలుకుబడితో పరిశ్రమలు తీసుకొచ్చి ఈ ప్రాంత యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని హామీ ఇచ్చారు. అనకాపల్లి లోనే ఆయన స్థిర నివాసం ఉంటారని తెలిపారు. ప్రజలను అన్ని విధాల మోసం చేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బాయ్ బాయ్ చెప్పాలని విజ్ఞప్తి చేశారు. కాగా స్థానికులు కొన్ని సమస్యలను ప్రస్తావించగా అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఎంవివి ఎన్నికల ప్రచారానికి విశేష ఆదరణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: తూర్పు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి సత్యనారాయణ ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుంది. ఆదివారం 16వ వార్డులో నిర్వహించిన పాదయాత్ర 95వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎంవిపి మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలు అందాలన్నా, పేదవాడు అభివృద్ధి, చెందాలన్నా మరలా ఏపీ ముఖ్యమంత్రిగా జగన్ అన్న పాలన రావాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు పేదవాడికి పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఎన్నికలని అన్నారు.ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఏపీ ముఖ్యమంత్రిగా జగనన్నను మరల ఆశీర్వదించాలని, అలాగే ఇక్కడ తూర్పు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రములో తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు మొల్లి అప్పారావు, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, మహిళలు పార్టీ శ్రేణులు, అభిమానులు, పలు కార్పోరేషన్ డైరెక్టర్లు, చైర్మన్లు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ శ్రేణులు మహిళలు పాల్గొన్నారు.

జననీరాజనాల మధ్య దక్షిణంలో జగనన్న సిద్ధం బస్సు యాత్ర

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: దక్షిణ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాకతో ప్రజలతోపాటు వైసీపీ శ్రేణుల్లో ఉత్సాహం ఉప్పొంగింది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో న్యూ కాలనీ జంక్షన్ వద్దకు సీఎం సిద్ధం బస్సు యాత్ర చేరుకుంది. అక్కడ నుండి వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ సారథ్యంలో దక్షిణ జనవాహిని, వైయస్ఆర్సీపీ శ్రేణులు జగనన్నకు ఘన స్వాగతం పలికారు. న్యూ కాలనీ జంక్షన్ మసీదుకు జగన్మోహన్ రెడ్డి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. జగనన్న పాటలకు యువత నృత్యాలు చేస్తూ అలరించారు. దక్షిణంలో జగనన్న అడుగు పెట్టగానే ఒక్కసారిగా దక్షిణం దద్దరిల్లే విధంగా కేకలు కేరింతలతో జగనన్నకు స్వాగతం పలికారు. వాసుపల్లి గణేష్ కుమార్ సిద్ధం బస్సు యాత్రలో జగన్మోహన్ రెడ్డి తో పాటు ప్రయాణించారు. ఆయనతోపాటు జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, దక్షిణ పరిశీలకులు ద్రోణం రాజు శ్రీ వాత్సవ్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ జాన్ వెస్లీ న్యూ కాలనీ నుండి సీఎం జగన్ తో పాటు బస్సు యాత్ర లో పాల్గొన్నారు.

కుసులువాడలో వైసీపీకి షాక్

గంటా సమక్షంలో పలువురు టీడీపీలో చేరిక

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం కుసులువాడ గ్రామంలో వైసీపీ ఖాళీ అయిపోయింది. ఆ గ్రామ సర్పంచ్ సహా మొత్తం పంచాయతీ కార్యవర్గం ఆదివారం టిడిపిలో చేరింది. భీమిలి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు వీరందరికీ పసుపు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలన పట్ల రాష్ట్ర ప్రజలంతా తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్ర ప్రజానీకాన్ని దగా చేశారన్నారు. పార్టీలో చేరిన వారందరికీ తగిన ప్రాముఖ్యత ఉంటుందని తెలిపారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంపై నమ్మకంతో గ్రామాలు గ్రామాలు వైసీపీని వీడి టిడిపిలోకి చేరుతున్నాయని పేర్కొన్నారు. వైసీపీకి గుడ్ బై చెప్పి టిడిపిలో చేరిన వారిలో కుసులువాడ సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి శివాజీ, ఉప సర్పంచ్ అత్తి రామారావు, వార్డు సభ్యులు తోమురోతు లక్ష్మి, కోరాడ పైడిరాజు, చింతాడ వెంకట సూర్యనారాయణ, రవ్వ లక్ష్మి, పిల్లా పార్వతి, ఈగల వెంకట రమణ, రేగాని రాము, రేగాని అప్పలనాయుడు, వరపుల గౌరి సహా గ్రామానికి చెందిన 500 కుటుంబాలు ఉన్నాయి. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ భీమిలి తెలుగుదేశం పార్టీఇంచార్జ్ కోరాడ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీలోకి చేరిన టైలర్లు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖ జిల్లా ప్రైమరీ టైలరింగ్ కోపరేటివ్ సొసైటీ సభ్యులు, పాలకవర్గ సభ్యులు తూర్పు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణకి మద్దతు పలికారు. ఈ మేరకు స్థానిక 19వ వార్డు పెదజాలరిపేటలో వాల్తేరు డిపో వద్ద జరిగిన సమావేశంలో సత్యనారాయణ ఆదివారం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు టైలర్స్ వైసీపీ పార్టీలోకి చేరారు. ఈ

సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో అర్హులకు సంక్షేమ పథకాలు అందించారని ముఖ్యంగా డ్వాక్రా మహిళలు టైలర్స్ సున్నా వడ్డీ పథకాలను అందించారన్నారు. ఎంతోమంది మహిళలను లక్షాధికారిగా చేశారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో ప్రతి ఒక్కరు కూడా మరల ఏపీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఆశీర్వదించి తూర్పు నియోజకవర్గంలో వైసీపీ జెండాను ఎగరవేసేందుకు ప్రతి ఒక్కరు కూడా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు వైసిపి ఇన్చార్జ్ సూరాడ వెంకట లక్ష్మి దాస్, వాడ మోదుల గణేష్, బెహరా వసంత అధిక సంఖ్యలో మహిళలు పార్టీ శ్రేణులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రలో కాపులకు ప్రాధాన్యత ఇవ్వని కాంగ్రెస్

విశాలాంధ్ర - ఆనందపురం: సీనియర్లను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కాంగ్రెస్ పార్టీ పగ్గాలు షర్మిలా రెడ్డి చేపట్టాక కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందని సీనియర్లు అంతా ఎంతో సంతోషపడ్డామని, అయితే పీసీసీ అధ్యక్షురాలిగా కొత్తగా వచ్చి షర్మిల కొత్త వారికి అవకాశం ఇచ్చి ఆయా ప్రాంతాల వారిని మోసం చేసారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జీవీఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ తాడి మనోహర్ కుమార్ తీవ్ర సంతృప్తిని వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో కాపులకు సరైన ప్రాధాన్యత, ప్రాతినిధ్యం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పార్టీలు కాపులకు ప్రాదాన్యత ఇస్తుంటే కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విస్మరించారని అన్నారు. ముక్కు మొహం తెలియని కొత్తవారికి పార్టీలో టికెట్ ఇచ్చారని, కాపులకు చాలా అన్యాయం చేశారు అన్నారు. టికెట్స్ అమ్ముకున్నారని కొందరు నేతలు చెబుతున్నారన్నారు. పార్టీలో సీనియర్ నేతలు అయిన రఘువీరాకు, గిడుగు రుద్రరాజుకు ఎవరికి ప్రాధాన్యత ఇస్తే పార్టీ ప్రజల్లోకి ఇంకా మరింత బలంగా ముందుకి వెళుతుంది అని, కొత్తవారికి టిక్కెట్లు కేటాయించడం సీనియర్ నాయకులను కక్షపూరితంగా మోసం చేశారని ప్రశ్నించారు.

కాంగ్రెస్ పార్టీ

ముస్లింలకు అన్యాయం చేసింది

సీనియర్ నాయకుడు హైదర్ అలీ సింకా

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ దక్షిణ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక లాగా ఉన్న ముస్లింలకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎమ్మెల్యే టికెట్ కేటాయింపులో అన్యాయం చేసిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత హైదర్ అలీ సింకా ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ పార్లమెంట్ కాంగ్రెస్ ముస్లిం మైనారిటీ విభాగం డాబాగార్డెన్స్ వి.జె.ఎఫ్. ప్రెస్ క్లబ్‌లో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో హైదర్ అలీ సింకా మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి కష్టకాలంలో అండగా ఉంటూ అహర్నిశలు పనిచేస్తున్న స్థానిక ముస్లిం నేతలకు సీటు ఇవ్వకుండా కాంగ్రెస్ జెండా మోయని జనసేన పార్టీ నుండి వచ్చిన కొత్త వ్యక్తికి సీటు కేటాయించిందని, డబ్బుకు అమ్ముడుపోయి కాంగ్రెస్ అధిష్టానం వ్యవహరిస్తున్న తీరు సరికాదన్నారు. ఇప్పటికైనా తప్పు సరిదిద్దుకొని ముస్లింలకు సీటు కేటాయించాలని, సామాజిక న్యాయం చేయాలని సింకా డిమాండ్ చేశారు. ఇచ్చాపురం నుంచి కృష్ణా జిల్లా వరకు ఒక్క ముస్లింకి కూడా కాంగ్రెస్ పార్టీ అధిష్టానం టికెట్ ఇవ్వలేదని విచారం వ్యక్తం చేశారు. మైనార్టీ ముస్లింలే మాకు అండ అని చెప్పి అన్ని రాజకీయ పార్టీలు కూడా ముస్లింలను చారులో కరివేపాకు లాగా తమ స్వార్థం కోసం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని విమర్శించారు. ఏపీలో 175 నియోజకవర్గాలు ఉన్నాయని ఇందులో కనీసం ఒక్కటి ముస్లింల కోసం కాంగ్రెస్ పార్టీ సీటు కేటాయించలేదని అన్నారు. వైఎస్ఆర్ రాజశేఖర్ రెడ్డి మాదిరిగా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు షర్మిల మీద ముస్లింలు ఎంతో ఆశలు పెట్టుకున్న టిక్కెట్లు ఇవ్వలేదని ఇది ఎంతో అన్యాయం, దురదృష్టకరమన్నారు. ముస్లింలు బీజేపీ బదులు కాంగ్రెస్ పార్టీకే ఓట్లు వేస్తారని ముస్లిం ఓటు బ్యాంకు పుంజుకోవాలంటే ముస్లింలకు తప్పనిసరిగా ఎమ్మెల్యే టిక్కెట్లు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ అధిష్టాన నాయకులు రుద్రరాజు, రాకేష్ రెడ్డి వంటి నేతలకు తెలిసినా మైనారిటీలకు టిక్కెట్లు ఇవ్వలేదన్నారు. అన్ని పార్టీలు ముస్లింలకు మొండి చెయ్యి చూపడం అన్యాయమన్నారు.

లోపాయికారిగా కాంగ్రెస్ అధిష్టాన నాయకులు అమ్ముడు పోయి టిక్కెట్లు ఇస్తున్నారని ఆరోపించారు. డబ్బు వున్న వారికే టిక్కెట్లు ఇస్తే ఎలా అని ప్రశ్నించారు. భవిష్యత్తులో ఇండిపెండెంట్లుగా పోటీ చేసి సత్తా చాటుతామన్నారు. గత 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవలు చేస్తున్న వారిని వదిలిపెట్టి ప్యాకేజీలకు అమ్ముడు పోయారని విమర్శించారు. కాంగ్రెస్ టికెట్లు అమ్ముకోవడంలో జిల్లా అధ్యక్షుడు గొంపా గోవింద రాజు, రాకేష్ రెడ్డి, రుద్ర రాజు పాత్ర వుందన్నారు. విశాఖ దక్షిణంలో ముస్లింల ఓట్లు చీల్చడానికి జనసేన నుంచి వచ్చిన కొత్త వ్యక్తికి కాంగ్రెస్ అధిష్టానం నాయకులు డబ్బుకు అమ్ముడుపోయి అసెంబ్లీ సీట్ కేటాయించారని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్టాన నాయకులు దక్షిణంలో కాంగ్రెస్ అభ్యర్థిని మార్చాలన్నారు. లేదంటే ముస్లిం నాయకుల్లో ఒకరిని కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా నిలబెడతామన్నారు. అవసరమైతే చందాలు వేసుకుని గెలిపిస్తామన్నారు. మీడియా సమావేశంలో మహబూబ్ షరీఫ్, షేక్ షాను, షరీఫ్, బుకారి మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికీ కాంగ్రెస్‌లోనే కొనసాగుతా!

కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నూనెల పోలారావు

విశాలాంధ్ర - పెందుర్తి: అధికార వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ఏర్పాట్లు చేసుకుంటున్న కొందరు జిల్లా కాంగ్రెస్ నాయకులు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, తాను ఎప్పటికీ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని కాంగ్రెస్ బీసీ సెల్ విశాఖ జిల్లా అధ్యక్షులు నూనెల పోలా రావు యాదవ్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత 33 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్న తనపై ఎన్ని పార్టీలు ఒత్తిడి చేసినా పార్టీ మారే ఆలోచన చేయలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలో లేకపోయినప్పటికీ ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి సొంత నిధులతో అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. స్వర్గీయ వైయస్సార్ హయాంలో ఉమా నీలకంఠేశ్వర ఆలయ ట్రస్టీగాను, 34,33,55 వార్డు పార్టీ అధ్యక్షులుగాను వ్యవహరించినట్లు తెలిపారు. తన వార్డు పరిధిలోని వందేళ్ల చరిత్ర గల రామాలయాన్ని అభివృద్ధి చేయడానికి సంకల్పించి పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలనుండి సాయం కోరగా పలువురు ప్రముఖులు స్పందించారని తెలిపారు. అలాంటి వారిని ఆలయ అభివృద్ధి కమిటీ తరఫున ఘనంగా సత్కరించినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో రామాలయం అభివృద్ధికి ఆర్థిక సాయం అందించిన విశాఖ ఉత్తర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేకే రాజును కూడా సన్మానించినట్లు చెప్పారు. ఆ సమయంలో కేకే రాజు తన మెడలో ఉన్న వైసిపి కండువాను తన మెడలో వేశారు తప్ప తాను వైసీపీలో చేరలేదని పోలారావు యాదవ్ స్పష్టం చేశారు. దీన్ని ఫోటో తీసి కొందరు కాంగ్రెస్ నాయకులు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో పెద్ద నాయకులుగా చెప్పుకుంటున్న కొందరు కాంగ్రెస్ నాయకులు అధికార పార్టీలో చేరడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారని, త్వరలో అన్ని విషయాలు బయటకు వస్తాయని ఆయన పేర్కొన్నారు.

నరవ, గొరపల్లి, సరిపల్లిలో

గుంటూరు ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏపీ గిడ్డంగుల శాఖ మాజీ డైరెక్టర్ గుంటూరు వెంకట నరసింహారావు తనదైన శైలిలో ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. అభిమానులు, మద్దతు దారులతో కలిసి గ్రామాలలో కలియ తిరుగుతూ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు.

శనివారం రాత్రి నరవ గ్రామంలో ఇంటింటి ప్రచారం చేసిన, గుంటూరు వెంకట నరసింహారావు ఆదివారం సరిపల్లి గొరవల్లి గ్రామాలలో ముమ్మర ప్రచారం సాగించారు.

ఆయా గ్రామాలలో అభిమానులు నాయకులను కలసి మన పెందుర్తి మన అభివృద్ధి మన పార్టీ నినాదంతో వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనకు ఓ అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వలసదారుల కారణంగా నియోజకవర్గం అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చంధంగా ఉండిపోయిందని ఇకనైనా ప్రజలందరూ మేలుకోవాలని కోరారు. ఇప్పుడు కూడా నిర్లక్ష్యంగా ఉంటే మరో ఐదు ఏళ్ళు పాటు అందరం ఇబ్బందులు పడాల్సి వస్తుందని వివరించారు.

నరవలో స్థానికంగా హెూటల్ యజమాని ధన తదితరులు వెంకట నరసింహారావుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

అలాగే గొరపల్లిలో వద్దాది ఈశ్వరరావు, కంచిపాటి జగన్నాథం, మట్టా శ్రీనివాస్, వబ్బిన శ్రీనివాస్, స్వామి నాయుడు, ధర్మ, మునసబు గారి కుటుంబ సభ్యులను కలిసి వచ్చే ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని కోరారు. ఇటీవల గొరపల్లిలో అనుమానాస్పదంగా మృతి చెందిన న్యాయవాది చిక్కాల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించి అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

జనసేనలో చేరిన మహిళలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జనసేన పార్టీలో 39వ వార్డు చిలకపేటకు చెందిన మహిళలు , యువత భారీగా చేరారు. మహిళలు" రాజా గౌడ్" ఆధ్వర్యంలో "వంశీకృష్ణ" సమక్షంలో కృష్ణ గార్డెన్స్‌లో గల పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీలో జాయిన్ అయ్యారు. జంగలమ్మ, మసేనమ్మ, జయ, సిహెచ్. వెంకటలక్ష్మి ,పారు, దేవి, నవ్య, రాజి, గాయత్రి, గంగోత్రి, ప్రసన్న, శ్రావణి, స్వాతి, బుజ్జి, మంగమ్మ, రాజమ్మ, పరదేశమ్మ, బుజ్జి, బంగారమ్మ, హేమలత, వరలక్ష్మి, రాజమ్మ, పార్వతి, కొర్లమ్మ, రాజ్యలక్ష్మి, ఓగమ్మ, దానియమ్మ, అప్పయ్యమ్మా తదితర మహిళలు సుమారు 50 మంది జనసేన కండువా కప్పుకున్నారు. వారందరినీ వంశీకృష్ణ సాధారంగా పార్టీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో 39వ వార్డు జనసేన వార్డు ప్రెసిడెంట్ తాతారావు పాల్గొన్నారు. కృష్ణ గార్డెన్స్ పార్టీ ఆఫీసులో 37వ వార్డు అధ్యక్షులు గరికిన రవి ఆధ్వర్యంలో మత్స్యకార యువకులు జనసేన పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి దక్షిణ నియోజకవర్గ కూటమి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ జనసేన కండువా వేసి ఘన స్వాగతం పలికారు. ఆనంద గణపతి యూత్ సభ్యులు సభ్యులు అందరూ జై జనసేన నినాదంతో వంశీకృష్ణ కు మద్దతు తెలిపారు. వంశీ కృష్ణ ను అఖండ మెజారిటీతో గెలిపించడమే తమ ధ్యేయమని మత్స్యకార యువకులు తెలిపారు. కార్యక్రమంలో చింతపల్లి పెద్దయ్య, వాడమొదుల పోలరాజు ,చింతపల్లి రాజు, చింతపల్లి గణేష్, పిల్లాసాగర్, వాడమొదుల అచ్యుతరావు కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చీకటి రమేష్, సురేష్ పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

కళింగవైశ్య సామూహిక ఉపనయన బ్రహ్మోపదేశ మహోత్సవం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ (జిల్లా) కళింగవైశ్య యువజన చైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో సింహాచలం మారుతీ కళ్యాణ మండపంలో సామూహిక ఉపనయన బ్రహ్మోపదేశ మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. కావున ప్రతి ఒక్కరు ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గెలుపుకు సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో సప్పంగి శ్రీను, చంద్రమౌళి, లంకా భాస్కరరావు, సాయి, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.